# చవితి వేడుకలకు సర్వం సిద్ధం

వినాయకచవితి వేడుకలకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలను అమర్చారు. నాలుగురోడ్ల కూడళ్లలో చలువ పందిళ్లు వేశారు. నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా ని ర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.



కొండపల్లిలో విద్యార్థులు తయారుచేసి పంపిణీ చేసిన మట్టి వినాయక ప్రతిమలు

గంపలగూడెం: వినాయక చవితి సందర్భంగా నవరాత్రుల నిర్వహణకు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. గంపలగూడెం, తోటమూల, పెనుగొలను, ఊటుకూరు, గోసవీడు, నెమలి తదితర గ్రామాల్లో గణనాథుని నెలకొల్పేందుకు ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు వేశారు.

ఇబ్రహీంపట్నం: కొండపల్లి క్రాంతి హైస్కూల్లో మట్టిగణపతే మహా గణపతి నినాదంతో 500 మట్టి ప్రతిమలు విద్యార్థులు తయారుచేసి ఆదివారం స్థానికులకు అందజేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతో ఏర్పడే జల, వాయు కాలుష్యంపై అవగాహన కల్పించారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ఇళ్లల్లో పూజించేందుకు అవసరమైన చిన్నసైజు గణపతి ప్రతిమలు, పత్రి సామగ్రి అమ్మకాలు ముమ్మరంగా జరిగాయి.

**నేటి నుంచి శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రులు**

మైలవరం: మైలవరం నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతిస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి శ్రీలక్ష్మీ గణపతి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 18న సోమవారం శ్రీలక్ష్మీ గణపతి హోమం, 19న సరస్వతీ హోమం, 20న సుదర్శన హోమం, 21న కుబేరా హోమం, 22న లక్ష్మీ హోమం, 23 శనివారం ధన్వంతరి హోమం, 24 వాస్తు హోమం, శాంతి కల్యాణం, 25న రుద్రహోమం, 26న శ్రీసుబ్రహ్మణ్య హోమం, 27న గణపతి హోమం, 28న నరసింహ హోమం, 29న దుర్గా హోమం , 30న హనమత్ హోమం, అక్టోబర్ 1న యధాశక్తి సర్వ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. మైలవరం వారిచే శ్రీలక్ష్మీగణపతికి గ్రామోత్సవం అనంతరం కృష్ణానదిలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

**తిరువూరులో..**

తిరువూరు: వినాయక చవితి సందర్భంగా తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కమిషనర్ బాలకృష్ణ బోస్ సెంటర్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**చాట్రాయిలో..**

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తిరపతయ్య అనే ఉపాధ్యాయుడు మట్టితో తయారు చేసిన 116 గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.

ముసునూరు: మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలకు ఆయా గ్రామాల వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వాడవాడలా నవరాత్రి పందిళ్లకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నూజివీడు: వినాయక చవితితో పాటు నవ రాత్రులను జరుపుకునేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వెచ్చించి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోను విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్



నూజివీడు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆనందంగా పర్వదినాన్ని నిర్వహించుకోవాలని, అభివృద్ధిలో ముందుకు సాగాలని అభిలషించారు.

## స్వచ్ఛ తిరువూరుకు సహకరించాలి



తిరువూరు: చెత్తరహిత పట్టణంగా తిరువూరును తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి కోరారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. చీరాల సెంటర్ నుంచి ఫ్యాక్టరీ సెంటర్ వరకు ప్లకార్డులు, బ్యానర్లతో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ ప్రాధాన్యతను వివరిస్తూ ఈ ప్రదర్శన నిర్వహించారు. చైర్‌పర్సన్ కస్తూరిబాయి, కమిషనర్ బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు.

## దర్గాలో ఎమ్మెల్సీ రుహుల్లా ప్రార్థనలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మతసామరస్యానికి ప్రతీకగా విరాజిల్లుతున్న షాబూకారీ దర్గాలో విజయవాడ నగరానికి చెందిన ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు సాదరంగా ఆహ్వానం పలికారు. సర్వమానవాళి సంక్షేమం కోరుతూ షాబూఖారీబాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## అబ్దుల్ ఖాదర్ జిలానీ సంతాప సభ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): షాబూఖారీ దర్గా మతగురువు మహ్మద్ ఆల్తాఫ్ రజా తండ్రి మహ్మద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ సంతాప సభ స్థానిక షాబూఖారీ దర్గా కర్బల్ మైదానంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు జిలానీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పర్యావరణ హితం ప్రతి ఒక్కరి బాధ్యత

**ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్**



మట్టి ప్రతిమల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

మైలవరం: పర్యావరణ హితమే ప్రధాన లక్ష్యంగా అందరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరంలోని మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో సంఘమిత్ర థియేటర్ వద్ద మట్టితో తయారు చేసిన గణనాథుని ప్రతిమలను ఎమ్మెల్యే వసంత ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం, వాతావరణం, నీటి కాలుష్యం కాకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మైలవరంలో ప్రతి సంవత్సరం మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ చేస్తున్న మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ, సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ వినాయక చవితి సందర్భంగా విఘ్నాలు తొలగి అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైలవరం జమీందారు తనయుడు ఎస్వీ నివృతరావు, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి, మైలవరం జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, ఏసీపీ మారగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

● **సుందరమయంగా అంతర్గత రహదారులు**

ముసునూరు: జగనన్న పాలనలో పల్లెల్లోని అంతర్గత రహదారులన్నీ సుందరమయం కానున్నాయని వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని లోపూడి శివారు బాసవరప్పాడులో పంచాయతీరాజ్ నిధులు రూ.12.65 లక్షలతో 230 మీటర్ల పొడవున నిర్మించతలపెట్టిన అంతర్గత సీసీ రహదారి నిర్మాణ పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఉప సర్పంచ్ మువ్వా బాబూరావు పాల్గొన్నారు.

● **ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి చిరస్మరణీయుడు**

తిరువూరు: 'భారతదేశం నా మాతృభూమి' ప్రతిజ్ఞ రాసిన పైడిమర్రి వెంకటసుబ్బారావు దేశప్రజల్లో దేశభక్తిని, సహోదరభావాన్ని పెంపొందించి చిరస్మరణీయుడిగా మిగిలారని తెలుగు భాషా వికాస సమితి కన్వీనర్ తోట ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ ఆవిర్భావ దినోత్సవాన్ని తిరువూరు గీతమ్స్ స్కూల్లో నిర్వహించారు

● **పేదలకు ఆర్థిక చేయూత విశ్వకర్మ కౌసల్య యోజన పథకం**

నూజివీడు: పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ విశ్వకర్మ కౌసల్య యోజన పథకాన్ని ప్రారంభించారని బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అన్నారు. ఓబీసీ మోర్చా జిల్లా నాయకుడు అంబటి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో జరిగిన విశ్వకర్మ జయంతిలో విక్రమ్ కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. .

● **విశ్వకర్మ జయంతి వేడుకల్లో పురందేశ్వరి**

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలోని శ్రీగిరి వీరేశ్వర విశ్వేశ్వరస్వామి ఆలయంలోని శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి మహాయజ్ఞంలో ప్రత్యేక పూజలు చేశారు.

● **వృత్తి పనులకు ఆద్యుడు విశ్వకర్మ**

ముసునూరు: సకల దేవతలకు, మానవాళికి కళా నైపుణ్యాలు నేర్పి, ఆయుధాలు అందించి, వృత్తి పనులకు ఆద్యుడుగా విశ్వకర్మ చరిత్రలో నిలిచారని విశ్వకర్మ సేవా సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు హరనాథ్, నాగాచారి పేర్కొన్నారు. మండలంలోని చెక్కపల్లిలో ఆదివారం ఆ సంఘ ఆధ్యర్యంలో విశ్మకర్మ జయంతిని నిర్వహించారు.

**చాట్రాయిలో..**

చాట్రాయి: విశ్వకర్మీయుల ఆరాధ్య దైవమైన విశ్వకర్మ జయంతిని ఆదివారం చాట్రాయిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల విశ్వకర్మీయుల అధ్యక్షుడు వంకిణి శివ జెండాను ఆవిష్కరించారు.

తిరువూరు: విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని తిరువూరు శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటాన్ని పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. సంఘ అధ్యక్షుడు ఏలేశ్వరపు కుమారరాజా, కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

**గంపలగూడెంలో..**

గంపలగూడెం: విశ్వకర్మ జయంతిని ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పెనుగొలనులో విశ్వకర్మ చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. నిర్వహణ కమిటీ సభ్యులు రంగు సత్యనారాయణ విశ్వకర్మకు పూజలు జరిపారు.

**వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుకుమార్**

నూజివీడు: ఏలూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముసునూరు మండలం వేల్పుచర్ల హైస్కూల్‌కు చెందిన పీడీ సుకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఇన్‌చార్జి రవీంద్ర ఆదివారం తెలిపారు. సుకుమార్‌ను నూజివీడు సబ్‌జోన్ అధ్యక్షులు లక్ష్మీ, సెక్రటరీ సుగుణరావు అభినందించారు.

● **కలెక్టర్‌కు కృతజ్ఞతలు**

నూజివీడు: వృద్ధుల సంక్షేమం, పరిరక్షణకు ఏలూరు జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లకు ప్రత్యేక అధికారులను నియమించడంపై సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివరామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.